
బద్మాష్
MVS
PUBLICATIONS
మధుబాబు

# బద్మాష్

*(ఎ షాడో స్పై అడ్వెంచర్)*

రచన:

మధుబాబు

*© Author*
*© Madhu Baabu*
*This digital book is published by -*

[*కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.*]

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

*All rights reserved.*

*No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.*

# బద్మాష్

“మర్యాదగా జేబుల్లో వున్న వస్తువుల్ని తీసి బైట పెట్టు బ్రదర్.... ఆలస్యం చేశావంటే యింకో కోటా యివ్వాల్సి వస్తుంది” పిడికిలి బిగించి షాడో ముక్కుమీద ఆనిస్తూ అన్నది ఆ గబ్బిల బిబ్బోకవతి.

పిడుగులు పడినట్లు బాధ పెడుతున్న తలను తడుముకుంటూ లేచి కూర్చున్నాడు షాడో. ముఖానికి అంటిన మట్టిని దులుపుకుంటూ చుట్టూ చూశాడు.

పొడుగాటి యినుప చువ్వల్ని పట్టుకొని పిశాచినుల మాదిరి చుట్టూరా నిలబడివున్నారు మరో ఐదుగురు ముద్దు గుమ్మలు. వాళ్ళు చెప్పినట్లు వెంటనే చేయకపోతే యింకోసారి ఆ యినుపచువ్వల బారిన పడక తప్పేటట్లు లేదు.

“బూటుంగ్ సిటీ అంతా రాక్షసులవంటి రౌడీలతో నిండి వుంటుంది. వళ్ళు దగ్గిర పెట్టుకొని సంచరించకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది... బీ కేర్ ఫుల్ రాజూ.” అని ముందుగానే హెచ్చరించి పంపించారు కులకర్ణిగారు.

రౌడీలు వుంటారని అన్నారే గాని ఆడరౌడీలు వుంటారని ఆయన అనలేదు. అనివుంటే ముందు జాగ్రత్తలు తీసుకొని వుండేవాడు తను.

“మా మాటలు నీకు వినిపించలేదా బ్రదర్? పడిన దెబ్బలు సరిపోలేదా?” ఇనుపచువ్వను క్రిందికి దించి అతని తలమీద ఆనిస్తూ క్రూరంగా అంది ఒక వాలు కనుల వగలాడి.

అదిరిపడి తన ఆలోచనలనుండి బయటపడ్డాడు షాడో.

“బుద్ధి గడ్డితిని యిటుగా వచ్చాను తల్లీ... తిన్న దెబ్బలు ఇంకో రెండు నెలలదాకా ఖచ్చితంగా జ్ఞాపకం వుంటాయ్. మీరు కొత్త కొత్త ఆలోచనలు ఏవీ చేయకండి” అంటూ లేచి నిలబడి పాంటు జేబులో చేయి పెట్టాడు.

విజయగర్వంతో ముసిముసి నవ్వుల్ని వెలువరించారు ఆ యువతీమణులు అందరూ. విలాసంగా నిలబడి వయ్యారంగా చేయి జాచింది ఒక జవరాలు.

కంటికి కనిపించనంత వేగంగా కదిలాయి షాడో చేతులు ఏం జరుగుతున్నదో వారికి అర్థమయ్యే లోపుగానే ఆ జవరాలి భుజాల్ని పట్టుకొని ప్రక్కనేవున్న బురద గుంటలోకి నెట్టాడు.

మురికినీరు ముక్కుల్లో చెవుల్లోకి పోయి వుక్కిరి బిక్కిరి చేస్తుండగా పోలీస్ సైరన్ మాదిరిగా అరవటం ప్రారంభించిందామె.

ఆ అరుపుల్ని వినిపించుకోకుండా కాళ్ళకు కాళ్ళు అడ్డంపెట్టి యింకో ఇద్దర్ని రోడ్డు మీద పడేశాడు షాడో. క్రింద వున్న తన ఎయిర్ బాగ్‌ని అందుకుని మరో యిద్దరి పిర్రల మీద బలంగా బాదాడు.

తన చేతిలోవున్న యినుపచువ్వను గిరగిరా తిప్పుతూ అతని మీదికి దూకింది వారందరిలోకి చాలా అందంగా కనిపిస్తున్న ఆఖరి యువతి.

“నీ అంతు చూడకపోతే నా పేరు మార్చుకుంటాను.... నీ ఎముకల్ని విరిచి చూర్ణం చేస్తాను. కుక్కా నక్కా ఎలుకా, పిల్లి.” అని యిష్టంవచ్చిన మాటలతో దారుణంగా తిడుతూ అతని తల పగలగొట్టడానికి ప్రయత్నించింది.

ఎయిర్ బాగ్‌ని తలకు అడ్డం పెట్టుకుని తల పగలకుండా తనను కాపాడుకున్నాడు షాడో. ఆమెతో గాని, మిగిలిన వారితో గాని నిలబడి కలబడే ఆలోచన అతనికి లేదు. మురుగ్గుంటలో పడిన బిబ్బోకవతి భూమి ఆకాశం బ్రద్దలయిపోయేలా అరుస్తోంది. ఆ అరుపుల్ని విని పరుగు పరుగున రోడ్డుమీదికి వస్తున్నారు అనేకమంది దృఢకాయులు.

ఇక అక్కడ్నుంచి వెంటనే కాళ్ళకు బుద్ధిచెప్పకపోతే ఆ తరువాత బాధపడికూడా ప్రయోజనం వుండదని గ్రహించి, గిర్రున వెనుతిరిగాడు షాడో.

"ఆగరా బద్మాష్! ఆగు!!" కాళికాదేవిలా అరిచింది ఆఖరి ముద్దుగుమ్మ.

ఆగే ప్రయత్నం చేయలేదు షాడో. ఎదురుగా కనిపించిన ఒక సందులోకి జంప్ చేసి పిక్కబలం చూపించటం మొదలెట్టాడు.

"దొంగ దొంగ... పట్టుకోండి... పట్టుకోండి... పట్టుకోండి." అని అరుస్తూ అతన్ని అనుసరించారు రోడ్డుమీదికి వచ్చిన దృఢకాయులందరూ.

గంయ్ మని గురకలు పెడుతూ షాడో దారికి అడ్డం వచ్చాయి నాల్గు శునకాలు. పాదాల్ని పట్టుకోబోయిన ఒక కుర్రశునకాన్ని ఫుట్ బాల్‌లా తన్ని అక్కడికి పదడుగుల దూరంలోవున్న ఇంకో చిన్న సందులోకి దూరాడు షాడో. పెద్ద కుంకుడు చెట్టొకటి కనిపించిందతనికి ఆ సందుచివర. దాని క్రింద పడుకుని పెద్దగా గురకలు తీస్తున్నాడు ఒక మనిషి.

అటూ యిటూ చూసి ఎయిర్ బాగ్‌ని చెట్టుచాటున దాచాడు షాడో. ఆ పెద్దమనిషిని కొంచెం అవతలికి దొర్లించి అతని ప్రక్కనే పడుకున్నాడు. అంతటితో ఆగకుండా అతను కప్పుకొని వున్న చినుగుల కంబళీని తను లాక్కుని తల దగ్గర్నించి పాదాలదాకా ముసుగు పెట్టుకున్నాడు.

రెండునిముషాల తరువాత ఆ సందులోకి వచ్చారు అతన్ని వెంటాడుతున్న దృఢకాయుల్లో కొంతమంది. కుంకుడు చెట్టుచుట్టూ రెండు రౌండ్లుకొట్టి, కంబళీ కప్పుకుని వున్న షాడో భుజం తట్టాడు వారిలో ఒకతను.

పదిక్షణాలు ఆగి కంబళీనుంచి తలమాత్రం బయటపెట్టాడు షాడో. బంగారంలాంటి నిద్ర చెడగొట్టినందుకు వారందరిమీద విరుచుకుపడ్డాడు.

"ఆ బద్మాష్ యిటువైపు వచ్చివుండడు... ఒకవేళ వచ్చినా యీ నిద్రముఖానికి అతన్ని గురించి తెలిసే అవకాశం లేదు. పదండి పోదాం." అంటూ వెనుతిరిగాడు యిద్దరు దృఢకాయులు.

ఒకరొకరుగా వారిద్దర్నీ అనుసరించారు మిగిలిన వారందరూ.

పది నిముషాలు ఆగి మెల్లిగా లేచి నిలబడ్డాడు షాడో.

కంబళీని మళ్ళీ గురకలు పెడుతున్న పెద్దమనిషిమీదే కప్పి, చెట్టుచాటున దాచిన ఎయిర్ బాగ్‌ని భుజంమీద వేసుకొని నెమ్మదిగా రోడ్డుమీదికొచ్చాడు.

అతన్ని అటకాయించి జేబులో ఖాళీ చేయాలని ప్రయత్నించిన బిబ్బోకవతులు ఆ పరిసరాల్లో ఎక్కడా కనిపించలేదు. అతన్ని పట్టుకోవటానికి బయలుదేరిన దృఢకాయులతో కలిసి సందు గొందుల్ని గాలించటానికి పోయి వుండవచ్చు!

వాళ్ళు కొట్టిన దెబ్బల్ని తలుచుకునేసరికి మరోసారి జివ్వుమన్నాయి షాడో నరాలు. బొప్పెలుకట్టిన తలను తడుముకుంటూ వేగంగా అడుగులు వేశాడు.

బూటుంగ్ సిటీ దక్షిణభాగంలో వున్న సప్రూబజార్ దగ్గిరికి పోతుంది ఆ రోడ్డు. సప్రూబజార్‌కి రెండు మైళ్ళదూరంలో వుంటుంది హార్బర్ ఏరియా.

హార్బర్ ఏరియాలో వుండే టోటోబార్ దగ్గిరికి సరిగ్గా పదకొండు గంటల పదినిముషాలకు వస్తాడట ఒక యింటర్‌పోల్ ఏజెంట్.

పాంటు జేబులోవున్న సిగరెట్ పాకెట్‌ని తీసి సిగరెట్ వెలిగించుకుంటూ నిర్మానుష్యంగా వున్న సప్రూబజార్లో అడుగు పెట్టాడు

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/kbook.php?id=376